ఇంటి వద్దకే పింఛను

- ఎన్టీఆర్ భరోసా పేరుతో రేపటి నుంచి పంపిణీ
- సచివాలయ సిబ్బందికి చేరిన నగదు
- లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయనున్న యంత్రాంగం

చేజర్ల, జూన్ 29 : 1వ తేదీన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంతో అవ్వాతాతల కష్టాలు తీరనున్నాయి. పెన్షన్ సొమ్ము పెంచి ఇస్తామనే ఎన్నికల ముందు హామీని అమలుచేస్తూ ఆయా మండలాలకు పెంచిన మొత్తం నిధులు కేటాయించారు. జూలై 1న పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా పేరుతో సచివాలయ ఉద్యోగులతోపాటు ఇతర ఉద్యోగులతో ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛను సొమ్ము పంపిణీ చేసేలా మార్గదర్శకాలు జారీచేశారు.



పెంపు ఇలా..

జిల్లాలో 3,19,961 మంది లబ్ధిదారులకు రూ.218.87 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వృద్ధులు, వితంతువులు, ఒంటిరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులకు రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. వీరికి ఏప్రిల్ 1 నుంచి పెంపును అమలు చేసి, జులై ఒకటిన పింఛను కింద వీరికి రూ.7వేలు (జులై1న ఇచ్చే రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి 3 నెలలకు రూ.వెయ్యి వంతున కలిపి) అంద చేయనున్నారు. అదేవిధంగా దివ్యాంగుల పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 6వేలకు పెంచారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కు ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అందే రూ.5వేల మొత్తాన్ని 10వేలకు పెంచారు. కుష్ఠు కారణంగా బహుళ వైకల్యం సంభవించిన వారికి రూ.6వేల పింఛను ఇస్తారు. పూర్తిస్థాయిలో అస్వస్థతకు గురైన వారికి, తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన వారికి, వీల్ చైర్‌లో ఉన్న వారికి అందే రూ.5వేల పింఛన్‌ను 15వేలకు పెంచారు. ఇలా పింఛను మొత్తాన్ని సోమవారం నాడు పండుగ వాతావరణంలో అందజేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

అందరూ పాల్గొనండి : ఆనం

నెల్లూరు (హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో గ్రామ, వార్డు, కాలనీస్థాయిలో ప్రతి కార్యకర్త, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొనాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జులు, నాయకులందూ ఆయా సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో జిల్లా ప్రథమం

- ఒక్కరోజే 3,201 కేసుల పరిష్కారం




కేసుల వివరాలు వెల్లడిస్తున్న జిల్లా జడ్జి యామిని

నెల్లూరు (లీగల్), జూన్ 29 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోనే అత్యధిక కేసులు పరిష్కరించి జిల్లా ప్రథమ స్థానం సాధించింది. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న లోక్ అదాలత్ భవన్‌లో ఉదయం ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.యామిని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా పలు కోర్టులలో 3,201 కేసులు పరిష్కరింపబడ్డాయి. నగరంలో 1,658, గూడూరు లో 34, కోవూరులో 424, కావలిలో 117, ఆత్మకూరులో 141, ఉదయగిరి 35, వెంకటగిరిలో 223, కోటలో 420, సూళ్ళూరుపేటలో 141 కేసులు పరిష్కరింప బడ్డాయి. నగరంలో ఉన్న కోర్టులో ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించారు. ప్రిసైడింగ్ అధికారులుగా 1వ అదనపు జిల్లా జడ్జి జి. కబర్థి, 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి పినపాటి భరద్వాజ, స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ ఎన్.లావణ్య, స్పెషల్ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ పి.సుయోధన్, సెకండ్ ఏడీఎం శారదారెడ్డి, నాల్గవ ఏడీఎం భాస్కర్ కేసుల పరిష్కారంలో కీలకపాత్ర వహించారు. ఈ సందర్భంగా రాజీకి యోగ్యమైన పలు సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ మార్కుల జాబితాలు

నెల్లూరు (విద్య), జూన్ 29 : పదవతరగతి మార్కుల జాబితాలు www.bseap.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్ ద్వారా విద్యార్థుల హాల్ టికెట్ ఉపయోగించి మార్కుల జాబితాను పొందవచ్చని పేర్కొన్నారు. మార్కులు జాబితాలో ఏదైనా తప్పులు ఉంటే సరైన రికార్డులతో నేరుగా ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు 6వతేదీ లోపు పంపించాలని తెలిపారు.

స్టాంపుల ముద్రణలోనూ నాసిరకం!



ప్రస్తుతం చలామణి అవుతున్న నాసిరకం నాన్ జ్యుడిషియల్ స్టాంపు

- నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలో నాణ్యతలేని కాగితం
- డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లకి పనికిరావని సర్వత్రా ఆందోళన

కందుకూరు, జూన్ 29: అన్ని రంగాల్లోనూ అవినీతికి రాచబాట చేసిన గత జగన్ ప్రభుత్వం నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలోనూ చేతివాటం చూపింది. ఆస్తుల లావాదేవీల కోసం వినియోగించే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, సంస్థ రిజిస్ట్రేషన్లు, భాగ పంపకాల డీడ్‌లు, ఇతరత్రా నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలో నిబంధనలు మార్చేసి, నాసిరకమైన పేపరుతో ముద్రించిన స్టాంపులను వినియోగంలోకి తెచ్చింది. ఆ స్టాంపు కాగితాలు తీసుకున్న ప్రజలు వాటిని చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాతవాటినే పునురుద్ధరించాలని వారు కోరుతున్నారు.

మారిన ముద్రణ, డిజైన్

గత వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖామంత్రిగా ధర్మాన ప్రసాదరావు పనిచేశారు. ఆయన బాధ్యతలు చేపట్టాక అప్పటివరకు నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణ, సరఫరా ఆశాఖ పరిధిలోని ఉండేది.ఆయన ఆ బాధ్యతలను ఆశాఖ తప్పించి స్టాకు హోల్డింగ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించారు. దీంతో స్టాంపుల ముద్రణ, డిజైన్ అన్నీ మారిపోయాయి. అప్పటివరకు స్టాంపుల ముద్రణ అత్యంత నాణ్యమైన బాండ్ పేపరుపై జరిగేది. స్టాంపు విలువ ఎంత అయినప్పటికీ నాణ్యమైన పేపరునే ఉపయోగించేవారు. ఆ స్టాంపులను స్టాంపు వెండర్లు రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీల వద్ద తీసుకుని విక్రయించేవారు. ఇందుకోసం ప్రభుత్వం ఐదుశాతం కమీషన్ చెల్లించేది. అయితే స్టాంపుల ముద్రణ బాధ్యతలు స్టాకు హోల్డింగ్ కార్పొరేషన్‌కు అప్పగించాక నాణ్యమైన పేపరు స్థానంలో నాసిరకం పేపరును వాడటం ప్రారంభించారు. అంతేకాక స్టాంపు వెండర్లకు ఇచ్చే కమీషన్‌లోనూ కోత పెట్టారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వానికి, స్టాకు హోల్డింగ్ ప్రతినిధులకు మధ్య భారీగా నగదు చేతులు మారినట్లు విమర్శలు ఉన్నాయి. ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ చేయాలంటే స్టాంపు డ్యూటీ ఎంత కట్టాల్సి వచ్చినా, కనీసం రూ.500ల నాన్ జ్యుడిషియల్ స్టాంపులు తీసుకుని వాటిపై డాక్యుమెంటు సిద్ధం చేయించుకుని మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వానికి చలానా రూపంలోనో, ఆన్‌లైన్ పేమెంట్‌గానో చెల్లిస్తామనికానీ అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, ఇతరత్రా కార్యకలాపాలకు పూర్తిగా నాన్ జ్యుడిషియల్ స్టాంపునే వాడుతామని వినియోగదారులు చెబుతున్నారు. శతాబ్దాలపాటు పదిలంగా ఉండాల్సిన విలువైన డాక్యుమెంట్లకి నాసిరకం పేపరుతో నాన్ జ్యుడిషి యల్ స్టాంపులు ముద్రించటం దారుణమని పలువురు పేర్కొన్నారు. దీన్ని బట్టి ప్రజాప్రయోజనాల పట్ల గత ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధలేదని అర్థమవుతున్నదని వారు వాపోయారు. మాకు నాణ్యమైన స్టాంపులే కావాలని స్టాంపు వెండర్లని అడుగుతున్నా, మావద్ద పాత స్టాంపులు స్టాకు ఉన్నంతవరకు ఇచ్చామని, ఇక తాము చేయగలిగింది లేదని వారు తెగేసి చెబుతున్నారు.

స్టాంపు డ్యూటీ చెల్లింపులోనూ...

ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ చెల్లింపుల్లోనూ స్టాకు హోల్డింగ్ కార్పొరేషన్‌కు బాధ్యతలు అప్పగించారు. వారికి అవసరానికి మించి కమీషన్ ఇస్తూ నిబంధనలు సడలించటం పట్ల మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు స్టాంపు డ్యూటీని ఆస్తులు కొనుగోలు చేసుకున్నవారు బ్యాంకులో చలానా కట్టేవారు. అలాకాకుండా స్టాంపు వెండర్లు ద్వారా ఆన్‌లైన్ పేమెంటు జరిగితే వారికి 0.15 శాతం కమీషన్ ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం ఆ స్టాంపు డ్యూటీ చెల్లింపుల బాధ్యతలను కూడా స్టాకు హోల్డింగ్ ప్రతినిధులకు ఇస్తూ ఆదేశాలు ఇవ్వటమేకాక, వారి ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ అయిన మొత్తాలకు కమీషన్‌ను 0.40 శాతంకు పెంచటం విశేషం. దీంతో స్టాకు హోల్డింగ్ ప్రతినిధులు మీరు చేసే చెల్లింపులన్నీ మాద్వారా చేయించాలని స్టాంపు వెండర్లు, డాక్యుమెంటు రైటర్ల మీద ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రభుత్వానికి కేవలం అదనంగా చెల్లించే 0.25 శాతం కమీషన్ రూపంలోనే ప్రతిరోజు కొన్ని కోట్ల రూపాయల నష్టం వాటిల్లనుంది. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించి గతంలో మాదిరిగా నాణ్యమైన నాన్ జ్యుడిషియల్ స్టాంపులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా ఇళ్లు కట్టని కాంట్రాక్టర్లపై చర్యలు !

- ప్రభుత్వ నిర్ణయం తర్వాతే పెండింగ్ పనుల పూర్తి
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అధికారుల వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), జూన్ 29 : గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని గృహ నిర్మాణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మంచినీరు, పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరిచి, సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ రాజ్, హౌసింగ్, వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమం, ఆర్థిక తదితర శాఖలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకట్రావు, మాల్యాద్రి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో గతంలో మంజూరైన అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులు ప్రారంభిస్తారా!? లేదా!? వాటి పురోగతిని వివరించాలని ప్రశ్నించారు. దీనిపై అధికారులు వివరణ ఇస్తూ పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని, రాగానే అందుకు అనుగుణంగా వ్యవహరిస్తామని తెలిపారు. అలాగే పెండింగ్ బిల్లులు రూ.30 కోట్ల వరకు ఉన్నాయని, ఇళ్ల నిర్మాణాల్లో కొంతమేర బిల్లులు వసూలు చేసుకొని పనులు ఆపితే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల హౌసింగ్ శాఖ మంత్రి ఆదేశించారని అధికారులు తెలిపారు. అలాగే లేఅవుట్ల అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను కోరగా ఎన్ఆర్ ఈజీఎస్ శాఖ ఆ పనులను నిర్వహించినా హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే రూ.570 కోట్లు ఇవ్వడం జరిగిందని, అయితే కార్పొరేషన్‌లో నిధులు లేనందున ఇకపై తమ శాఖ బిల్లులు చెల్లించదని ప్రభుత్వానికి తెలిపామన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఏ ఏ శాఖకు బిల్లులు చెల్లిస్తుందో చూడాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ జయలక్ష్మి, డిప్యూటీ సీఈవో చిరంజీవి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

జయహో...!




కేవీఆర్ సర్కిల్ వద్ద యువత కేరింత



టీ20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో విశ్వవిజేతగా భారత్ నిలవడంతో అభిమానుల్లో ఆనందం పరవళ్లు తొక్కింది. ఎంతో ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై భారత్ గెలవడంతో జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేశారు. యువత రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టగా, ఇంకొందరు కేక్‌లు కట్ చేసింది.

'హంస'పై రామలింగేశ్వరుడి వైభోగం



విడవలూరు : రామతీర్థంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలో గణపతి పూజ, స్వామి వార్లకు మహన్యాస రుద్రాభిషేకాలు, కుంకు మార్చన, నివేదన, బలిహరణ పూజలు జరిగాయి. అనంతరం వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించిన హంస వాహనంపై రామలింగేశ్వరుడు కామాక్షీ దేవి సమేతుడై రామతీర్థం, వరిణి గ్రామ వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, భజనలు, నృత్యాల నడుమ ఊరేగుతూ వస్తున్న స్వామివారికి భక్తులు టెంకాయలు కొట్టి హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సమస్యలపై ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

రూ.13 కోట్ల అప్పుల్లో ఆత్మకూరు మున్సిపాలిటీ

- ఇష్టారాజ్యంగా పనులు చేసి బిల్లులు పెడతారా!?
- మున్సిపల్ బస్టాండ్ సముదాయం నిర్వహణ ఎవరిది?
- కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు

ఆత్మకూరు, జూన్ 29 : 'మున్సిపల్ నిధులు పక్కదారి పడుతున్నాయి. అభివృద్ధి పేరిట ఇష్టారాజ్యంగా పనులు చేసి బిల్లుల మంజూరుకు మాత్రం మున్సిపల్ కౌన్సిల్ అజెండాలో చేరుస్తున్నారు. మున్సిపాలిటీ ఇప్పుడు రూ.13 కోట్ల అప్పుల్లో ఉంది. కౌన్సిల్ అనుమతి లేకుండా మున్సి పల్ స్థలాలను లీజుకు ఇచ్చే అధికారం ఎవరికుంది? ఏడాది క్రితం నూతనంగా నిర్మించిన మున్సిపల్ బస్టాండ్ సముదాయం ఎవరి నిర్వహణలో నడుస్తోంది. రూముల బాడుగలు ఎవరికి ఇస్తున్నారు. అన్నిటిపై ఎంక్వాయిరీ కమిటీ వేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.' అంటూ టీడీపీ కౌన్సిలర్లతోపాటు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు షేక్ గౌస్‌బాష, మాదాల శ్రీనివాసులు నాయుడు, వైసీపీ అసమ్మతి కౌన్సిలర్ కొప్పో లు రమాదేవి, వైస్‌చైర్మన్ షేక్ సర్ధార్ పలు సమస్యలపై ధ్వజమెత్తారు. మున్సిపాలిటీలో నిధులు ఇష్టారాజ్యంగా దుర్వినియోగం కావడంతోపాటు అధికారుల పనితీరు అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. ఆత్మకూరు నడిబొడ్డున ఉన్న పాత మున్సిపల్ బస్టాండ్ భవనాన్ని కూలదోసి రూ.4.20 కోట్లతో నూతన భవన సముదాయం నిర్మించడం హర్షదాయకమేనన్నారు. అయితే అందులో కోటి రూపాయల మేర నుడా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ఉన్నారన్నారు. ఇప్పుడా బస్టాండ్ భవన సముదాయం ఎవరి ఆధీనంలో ఉందని నిలదీశారు. మున్సిపాలిటీకి అప్పగించారా!? అని ప్రశ్నించారు. కౌన్సిల్ అనుమతి లేకుండా మున్సిపల్ స్థలాలను లీజుకు ఇచ్చే అధికారం ఎవరికుందని నిలదీశారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై పూర్తి స్థాయి సమాచారం అందాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు మెమోలు జారీ చేశామన్నారు.



కంది అధిక నిల్వలపై కొరడా

చర్యలకు సిద్ధమైన జిల్లా యంత్రాంగం

పప్పు దినుసుల ధరల నియంత్రణే లక్ష్యం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 29 : జిల్లాలో కంది, శనగపప్పు నిల్వలు పెంచుకొని, కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. భారత ప్రభుత్వం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారమే వ్యాపారుల వద్ద స్టాక్ నిల్వల ఉండాలి. కానీ కొందరు వ్యాపారులు పప్పు దినుసులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత ఆరునెలల నుంచి కందిపప్పు ధర పెరిగిపోతోందే తప్ప తగ్గడం లేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.175 నుంచి 190 వరకు ఉంది. ఇంత ధరపెట్టి సామాన్య ప్రజానీకం కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వ్యాపారుల వద్ద నిల్వలపై దృష్టి సారించి ధరల నియంత్రణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది.

కంది, శనగ నిల్వల పరిమితులు

- టోకు వ్యాపారి : 200 మెట్రిక్ టన్నులు
- రిటైలర్ : 5 మెట్రిక్ టన్నులు
- పెద్ద చైన్ రిటైలర్ : 5 మెట్రిక్ టన్నులు
- డిపోలలో : 200 మెట్రిక్ టన్నులు
- మిల్లర్లు గత మూడు నెలల ఉత్పత్తి లేదా వ్యాపార స్థాపిత సామర్థ్యంతో 25 శాతం ఏది ఎక్కువైతే అది.
- దిగుమతిదారులు కస్టమ్ క్లియరెన్స్ తేదీ నుంచి 45 రోజులకు మించి దిగుమతి చేసుకున్న స్టాక్‌ను కలిగి ఉండరాదు.

అధిక నిల్వలు ఉంటే చర్యలు : జేసీ సేధు మాధవన్

కందిపప్పు, శనగపప్పు, కాబూలి శనగపప్పు స్టాక్ పరిమితులకు మించి నిల్వచేస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపా రులు తమ వద్ద నిల్వలను వినియోగదారుల వ్యవహారాల శాఖ జీఓఐ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్: ఎఫ్‌సీఏఐఎస్ఎప్ఓడబ్ల్యుఈబీ.ఎస్ఐసీ.ఇన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. పరిమితుల కంటే ఎక్కువగా ఉంటే జులై 12వ తేదీలోగా నిర్దేశించిన పరిమితులకు లోబడి పప్పుధాన్యాల స్టాక్ క్రమం తప్పకుండా జీఓఐ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ తర్వాత స్టాక్ పరిమితులు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బియ్యం ధరలపై చర్యలు తీసుకుంటాం

నెల్లూరు(హరనాథపురం) : ధరల పెరుగుదలపై చర్చించడానికి ధరల పర్యవేక్షణ కమిటీతో సమావేశం ఏర్పాటు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డీవీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'భగ్గుమంటున్న బియ్యం' కథనానికి ఆయన స్పందించారు. ధరల తగ్గుదలకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 100 కేజీల సాధారణ ధాన్యం మద్దతు ధర రూ.2183, గ్రేడ్-ఏ రకం రూ.2203గా నిర్ణయించామన్నారు. ఈ ధాన్యానికి బియ్యం దిగుబడి విలువ ధర రూ.34 నుంచి రూ.35గా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. అక్రమ నిల్వల నిరోధానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి శుక్రవారం వెబ్‌పోర్టల్‌లో స్టాకు వివరాలు వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భర్త ఇంటి ముందు భార్య నిరసన



భర్త ఇంటి ముందు బైఠాయించిన హిమజ

ముత్తుకూరు, జూన్ 29 : తనని దౌర్జన్యంగా ఇంటిలో నుంచి గెంటి వేశారని న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటి ముందు బైఠాయించి భార్య నిరసన చేపట్టిన సంఘటన ముత్తుకూరు మండలం వల్లూరు పంచాయతీ రామాపురంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మనుబోలు మండలం కాగితాలపూరుకు చెందిన హిమజకు రామపురానికి చెందిన అజయ్ కుమార్‌రెడ్డికి 2012లో వివాహం జరిగింది. 80 సవర్ల బంగారం, రూ.10లక్షల నగదుతో పాటు రూ.3లక్షల వెండి ఇచ్చి వివాహం చేశారు. కొద్ది రోజులు సజావుగా కాపురం చేశాక తన భర్త అజయ్, అత్త శ్రీలతతో కలిసి అదనపు కట్నం కోసం తనను వేధించడం ప్రారంభించారని బాధితురాలు హిమజ తెలిపింది. తన తల్లిదండ్రులు ఇక అదనంగా ఏమీ ఇవ్వలేమని చెప్పారన్నారు. దీంతో తరచూ మనస్పర్థలు రేగి పుట్టింటికి పంపించేసేవారన్నారు. అయితే మూడు రోజుల క్రితం తన బ్యాగును బయటపడేసి ఇంటికి తాళాలు వేసుకుని తన భర్త, అత్త వెళ్లిపోయారని, దీంతో గత్యంతరం లేక తాను భర్త ఇంటి ముందే తల్లిదండ్రులతో కలిసి నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. ముత్తుకూరు పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశామని, తనకు తగిన న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- మూడో అంతస్తు నుంచి పడ్డ వెల్వేషన్ అద్దాలు
- తెగిన విద్యుత్ తీగలు.. పరుగులు తీసిన స్థానికులు



మరమ్మతులు చేయిస్తున్న విద్యుత్ సిబ్బంది

కావలి రూరల్, జూన్ 29 : కావలి పట్టణంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. వాయునందన ప్రెస్‌వీధిలోని మూడంతుస్తుల భవనానికి అమర్చిన వెల్వేషన్ అల్యూమినియం ఫ్రేమ్, అద్దాలతోపాటు రోడ్డుపై పడింది. అల్యూమినియం ఫ్రేమ్ 11కేవీ విద్యుత్‌లైన్, ఎల్‌టీ లైనుపై పడింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడగా పెద్దశబ్దంతో మంటలు చెలరేగాయి. స్థానికులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఎవరికి గాయాలు కాకపోవటంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ వైర్లు తెగడంతో మద్దూరుపాడు సబ్ స్టేషన్‌లోని ఫీజులు ఎగిరిపోయాయి. స్థానికుల సమాచారంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పనులు చేపట్టి కరెంట్ సరఫరా చేసినట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.

ఉదయగిరి దుర్గంపై కూంబింగ్

- గుప్తనిధుల తవ్వకాల సామగ్రి స్వాధీనం



గుప్తనిధుల తవ్వకాల సామగ్రితో రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది

ఉదయగిరి రూరల్, జూన్ 29: స్థానిక దుర్గం అడవుల్లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది శనివారం కూంబింగ్‌లో నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుప్తనిధుల తవ్వకాలకు ఉపయోగించే సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడారు. కొందరు కొత్త వ్యక్తులు పర్యాటకుల రూపంలో దుర్గం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి గుప్తనిధుల తవ్వకాలు చేపడుతున్నారని ఉన్నతాధికారుల సమాచారం ఉందన్నారు. ఈ మేరకు మూడు బృందాలుగా ఏర్పడి తన సిబ్బందితో కలిసి వారంరోజులుగా దుర్గం అడవుల్లోని పురాతన కట్టడాలైన పెద్ద, చిన్న మసీదులు, కోటలు, బురుజులు, గుర్రపుశాలలు, ఇతర ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. ఈ కూంబింగ్‌లో పెద్ద మసీదుకు సమీపంలోని కోనేరు వద్ద గుప్తనిధుల తవ్వకాల జరిపిన ఆనవాళ్లు గుర్తించామన్నారు. కోనేరు చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టగా తవ్వకాలకు ఉపయోగించే డ్రిల్లర్లు, సమ్మెట, ఇనుపరాడ్లు తదితర సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు, పురావస్తు శాఖల అధికారుల సమన్వయంతో గుప్తనిధుల తవ్వకాల ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రిజర్వు ఫారెస్టులోకి ప్రవేశించడం నేరమని, ప్రవేశించినా అక్కడ కట్టడాలను తిలకించడం, సేదతీరడం తప్ప అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తవ్వకాలకు సంబంధించి ఇప్పటికే పలువురి అనుమానితులను గుర్తించామని, వారికి నోటీసులు ఇచ్చి విచారణ చేపడతామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వోలు టీ.శ్రీనివాసులు, ప్రసాద్, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి, లక్ష్మీప్రసన్న, నాయబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

- కారులో ఎర్రచందనం దుంగల స్మగ్లింగ్
- డ్రైవర్ పరారీ.. కారు, దుంగలను స్వాధీనం చేసుకొన్న పోలీసులు



ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డ కారు

రాపూరు(డక్కిలి), జూన్ 29: ఎర్రచందనం దుంగలను నింపుకుని వెలుతున్న ఓ కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం తెల్లవారుజామున రాపూరు మండలంలోని పెంచలకోన క్రాస్ రోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు కథనం మేరకు.. పెంచలకోన అడవుల్లో ఇటీవల కాలంలో ఎర్రచందనం స్మగ్లింగ్ జోరందుకుంది. ఎర్రచందన దుంగలను కార్లు, టెంపోలు, లారీల్లో నింపుకొని స్మగ్లింగ్ చేస్తున్నారు. ఇదేతరహాలో కారులో ఎర్రందనం దుంగలు నింపుకుని వెలుతున్న ఓ మారుతీ కారు పెంచలకోన క్రాస్ రోడ్డు సమీపంలో అదుపు తప్పి ముళ్లపొదల్లోకి వెళ్లింది. సమాచారం అందుకున్న రాపూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొనేలోగా కారు డ్రైవర్ పరారీ అయ్యారు. కారులో సుమారు రూ.6 లక్షలు విలువగల 9ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు వారు గుర్తించారు. దుంగలతో పాటు కారుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రాపూరు సీఐ సుబ్రమణ్యం తెలిపారు.

పొడల దుప్పి స్వాధీనం



చేజర్ల, జూన్ 29: నాగులవెల్లటూరులోని జనావాసాల మధ్యకు శనివారం పొడలదుప్పి వచ్చింది. దీన్ని కొందరు గ్రామస్థులు స్వాధీనం చేసుకుని అటవీశాఖ అధికారులకు సమాచార మిచ్చారు. కలువాయి సెక్షన్, టి.కే.పాడు బీట్ ఆఫీసర్ టి.భాగ్యరాజ్‌లను గ్రామానికి వచ్చి పొడల దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కండలేరు జింకల పార్కుకు తరలించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది రాహుల్, జనార్దన్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	266
లేయర్	204


బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6837
వెండి కిలో ధర	రూ. 90,600
వెండి ఒక గ్రాము	రూ. 92.60

లారీ ఢీకొని యువకుడి మృతి

మర్రిపాడు, జూన్ 29: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సైదుల్లా (24)అనే యువకుడు మృతి చెందాడు. రోడ్డు దాటుతుండగా బద్వేల్ వైపు నుండి నెల్లూరు వెళ్తున్న గ్యాస్ లారీ ఢీకొనటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం స్థానికులు 108లో ఆత్మకూరుకు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి జిల్లా వైద్యశాలలో తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఒక్కడే కుమారుడు కావటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



గుర్రపుడెక్క.. ముంచేను ఎంచక్కా!

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి నెల్లూరుకు ప్రధాన తాగు, సాగునీటి వనరులైన పెన్నానది, స్వర్ణాల చెరువులు. వీటిలో గుర్రపు డెక్కా విస్తరించుకుంది. నీటి పారుదల ఏ మాత్రం ముందుకు వెళ్లలేనంతగా ఈ తీగ కట్టుదిట్టంగా కమ్ముకుంది. దీంతో పెన్నాలో సాగు, తాగునీరు ముందుకు వెళ్లలేని దుస్థితి. ఇటు స్వర్ణాల చెరువు సహజత్వాన్ని కోల్పోవడంతోపాటు త్వరలో జరిగే రొట్టెల పండుగకు నీరు నింపుకునేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రానున్న గండాన్ని ముందుగా పసిగట్టి గుర్రపుడెక్కాకు తొలిగించాలని నగరవాసులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పెన్నమ్మను అలుముకున్న గుర్రపుడెక్క



స్వర్ణాల చెరువు దుస్థితి..

సూక్ష్మ చిత్రకారుడు సోమాకు రాష్ట్రీయ ప్రతిష్ట పురస్కార్



ప్రతిష్ట పురస్కార్ అవార్డును అందుకుంటున్న పద్మారత్నం

ముత్తుకూరు, జూన్ 29: స్థానిక సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మారత్నం రాష్ట్రీయ ప్రతిష్ట పురస్కార్ అవార్డు దక్కించుకున్నారు. లక్నోకి చెందిన వర్షిఫ్ వెల్నెస్ ఫౌండేషన్ చిత్రకళా రంగంలో ఎక్సలెంట్స్ ఆఫ్ రాష్ట్రీయ ప్రతిష్ట పురస్కార్ అవార్డుకు పద్మా రత్నంను ఎంపిక చేశారు. గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును సోమా అందుకున్నారు. పద్మారత్నంను పలువురు అభినందించారు.

దోమల నివారణకు చర్యలు

- జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నెల్లూరు (వైద్యం), జూన్ 29 : దోమల నివారణకు ప్రతి ఒక్కరు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సుంకు చెంగన్న స్కూల్‌లో మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మలేరియాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నీటి నిల్వ వల్ల దోమలు ఉత్పత్తి పెరుగు తుందన్నారు. తద్వారా మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యర్థపు నీటి గుంటలను మట్టితో పూడ్చాలని, మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలన్నారు. దోమకాటుకు గురికాకుండా ఇంటి కిటికీలకు మెష్‌లు, శరీరానికి పూర్తిగా దుస్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. కుండపెంకులు, కొబ్బరి బోండాలు, వాడని కూలర్లు, రోళ్ల తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అరవిందకుమార్, మలేరియా సూపర్‌వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ నందకుమార్, రమణమ్మ, నళిని తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా డాక్టర్ సునీత



వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కే సునీత

వెంకటాచలం, జూన్ 29 : విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా డాక్టర్ కే సునీత శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీఎస్‌యూ ప్రాంగణంలోని పరిపాలనా భవనంలో ఉదయం ఆమె బాధ్యతలు స్వీకరించగా పలువురు అభినందనలు తెలియజేశారు. ఆమె యూనివర్సిటీలోని సోషల్ వర్క్ విభాగంలో ఎన్నో సంవత్సరాల నుండి సహాయ ఆచార్యులుగా, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, ఇంకా ఎన్నో కీలకమైన విభాగాల్లో పనిచేశారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీ వీసీ సుందరవల్లికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వర్సిటీ అధికారులు జీ విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ ఆర్ మధుమతి, సుజాఎస్ నాయర్, డాక్టర్ సాయి ప్రసాద్‌రెడ్డి, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ జీ సుజయ్‌కుమార్ తదితరులు సునీతను కలిసి సన్మానించారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(విద్య), జూన్ 29 : నిబంధనలను పాటించటని కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీహర్ష మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలు నిబంధనలు పట్టించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కళాశాలలోనే పుస్తకాలు, యూనిఫామ్ విక్రయించడంతో పాటు అధిక ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నూతన భవనాలు నిర్మించి కళాశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ఇంటర్‌బోర్డు అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టి సంబంధిత కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ.నరేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో జాతీయ గణాంక దినోత్సవం

నెల్లూరు(విద్య), జూన్ 29 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ శాంపుల్ సర్వే సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి మాట్లాడుతూ ప్రముఖ సాంఖ్యక శాస్త్రవేత్త పద్మభూషణ్ ప్రొఫెసర్ ప్రశాంత్ చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు. అనంతరం సాంఖ్యక శాస్త్ర కార్యక్రమాలు, ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్టాటికల్ ఆఫీసర్లు ఎండీ.ఫజులుల్లా, వి.బాబు, ఆర్‌కె.బెహ్రా, వైస్ ప్రిన్సిపాల్ ఏవీ.రమణరావు, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పీఎంవీ.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్‌తో ఇబ్బందులు లేవు : కాకాణి

నెల్లూరు (విద్య), జూన్ 29 : కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్‌తో ఎలాంటి ఇబ్బందులు లేవని పోర్టు నిర్వాహకులు స్పష్టం చేస్తున్నా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన రాజకీయ స్వలాభం కోసం నిత్యం అనవసర ఆరోపణలు చేస్తూ రాద్ధాంతం చేయడం సిగ్గు చేటని మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. శనివారం నెల్లూరులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెర్మినల్‌ను తొలగిస్తున్నారని, యువతకు అన్యాయం జరుగుతుందంటూ అసత్య ప్రచారం చేయడంతోపాటు తాము అక్రమ టోల్‌గేట్లు పెట్టి అవినీతికి పాల్పడినట్లు సోమిరెడ్డి ఆరోపించారన్నారు. దీనిపై ఎలాంటి ఆధారాలున్నా, ధైర్యం ఉంటే రుజువు చేయాలని సవాల్ విసిరారు. తమపై వచ్చిన ఆరోపణలకు తాను ఎలాంటి విచారణకు అయినా సిద్ధమేనని, అసత్య ఆరోపణలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెలరోజుల్లోనే సోమిరెడ్డి భారీ అవినీతికి తెరలేపారని విమర్శించారు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే నీతో పాటు నిన్ను నమ్ముకున్న వారంతా బలి కాక తప్పదని హెచ్చరించారు. గెలిచినా, ఓడినా జిల్లాలోనే ఉంటూ వాచ్‌మన్ డ్యూటీ చేస్తామని, ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఇబ్బంది వచ్చినా అందరికీ అండగా నేతలంతా కలిసి కట్టుగా పోరాటం చేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), జూన్ 29 : నగరంలోని నెల్లూరు క్లబ్‌లో జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్యారమ్ ర్యాంకింగ్ పోటీలు నివారం ఉత్సాహంగా జరిగాయి. క్లబ్ సభ్యులకు జరిగిన డబుల్స్ పోటీల్లో వైసురేష్‌రెడ్డి-ఎవీ.రమేష్‌రెడ్డిలు జే.సురేష్‌రెడ్డి-సీహెచ్.డానియల్‌దివాకర్‌లపై 25-0, 24-4 పాయింట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. సింగిల్స్ విభాగంలో చిన్నివాసు, బర్నాబాసులు ఫైనల్స్‌కు చేరుకోగా ఆదివారం ఫైనల్స్ పోటీలు, ముగింపు కార్యక్రమం జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి వీఆర్.శ్రీధర్ తెలిపారు. ఈ పోటీలను జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీమన్నారాయణ, సభ్యులు పర్యవేక్షించారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి

ఇందుకూరుపేట, జూన్ 29 : మండలంలోని గంగపట్నం గ్రామంలో శ్రీచాముం డేశ్వరి అమ్మవారి దేవస్థానం పక్కన ఉన్న కోనేరులో మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు సంతపేటకు చెందిన నలుగురు స్నేహితులు చాముండేశ్వరి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. అక్కడ కోనేరులో స్నానం చేస్తుండగా వారిలో నవీన్ అనే వ్యక్తి మునిగిపోవడంతో పక్కన ఉన్న స్నేహితులు రక్షిం చి ఒడ్డుకు చేర్చి మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు.

'సోమశిల'లో వేట నిషేధం

అనంతసాగరం, జూన్ 29: సోమశిల జలాశయంలో జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధించినట్లు ఎఫ్‌డీవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు చేప గుడ్లు దశలో ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెప్పారు. ఉల్లంఘిస్తే అక్రమ వేట కింద చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

మీ సహకారానికి కృతజ్ఞతలు

- పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు



జేడీ మహేశ్వరుడు దంపతులను సన్మానిస్తున్న సంఘాల నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 29 : ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించానన్న సంతృప్తిని కలిగించేలా సహకరించిన ఉద్యోగులు, సిబ్బంది తదితరుల సహకారం మరచిపోలేనిదని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బీ.మహేశ్వరుడు పేర్కొన్నారు. ఆదివారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా జిల్లా పశువైద్యాధికారుల సంఘం, జిల్లా పశువైద్య శస్త్రచికిత్సకులు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రైల్వేఫీడర్సు రోడ్డులోని వెటర్నరీ పాలీక్లీనిక్ సమావేశ మందిరంలో జేడీ మహేశ్వరుడుకు ఆత్మయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖలో 39 ఏళ్ల పనిచేశానని, ప్రతిచోటా సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా జేడీగా బాధ్యతలు చేపట్టనున్న డాక్టర్ వీ.కోటేశ్వరరావుకు సైతం అందరూ సహకారం అందించాలని కోరారు. అనంతరం జేడీ మహేశ్వరుడు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మత్స్యశాఖల జేడీలు సత్యవాణి, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పశువైద్యాధికారి సోమయ్య, రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు జయచంద్ర, పశువైద్య శస్త్రచికిత్సకుల అధ్యక్షుడు జయప్రకాష్, పశుసంవర్ధకశాఖ జిల్లా ప్రత్యేక అధికారి చిన్నయ్య, చిత్తూరు జిల్లా జేడీ ప్రభాకర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం



ఉదయగిరి రూరల్, జూన్ 29: స్థానిక సుద్దబావివీధిలో ఇంటి ముంగిట పార్కింగ్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేసిన సంఘటన శుక్ర వారం రాత్రి చోటుచేసుకొంది. డ్రైవర్ మండ్ల రమేష్ తెలిపిన వివరాల మేరకు.. రాత్రి కారు ఇంటి ముందు నిలిపానని, శనివారం ఉదయం వచ్చి చూసేసరికి కారుకు ముందు, వెనుక భాగం అద్దాలు పూర్తిగా ధ్వంసమై ఉన్నాయి. గతంలో కూడా ఇలాగే కారు అద్దాలు ధ్వంసం చేశారని వాపో యాడు. ఇటీవల ఇతరుల కార్ల అద్దాలు సైతం ధ్వంసం చేయడంతోపాటు ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్, బ్యాటరీలు చోరీ చేస్తున్నారని వాపోయాడు. పోలీసులు అలాంటి వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరు, జూన్ 29: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్యులు, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాల్టీ పరిధిలో అన్ని ప్రాంతాలకు ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేస్తుడటం హర్షదాయకమని పలువురు కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. అయితే తాగునీటి సరఫరా సమయాన్ని పెంచి ప్రజలందరికీ నీరు సరఫరా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మాట్లాడారు. తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కౌన్సిలర్లు లేవనెత్తిన అన్ని అంశాలపై ఆనం రామ నారాయణ రెడ్డికి సమాచారం అందజేశామన్నారు. పలు అంశాలపై పూర్తిస్థాయి సమాచారం అందాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు మెమోలు జారీ చేశామన్నారు. చివరిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ మాట్లాడారు. అజెండాలో పొందుపరిచిన 25అంశాలలో ఆత్మకూరులో నారంపేట వద్ద ఉన్న పారిశ్రామిక వాడకు నీటి తరలింపుకు పైపులైను ఏర్పాటు అంశాన్ని రద్దు చేసి, మిగతా అంశాలను వాయిదా వేశామన్నారు. వాయిదాపడిన అంశాలపై తదుపరి సమావేశంలో చర్చించి కౌన్సిల్ అనుమతి పొందితే అమలు చేస్తామని తెలిపారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ సాంబశివ చారిట బుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఔదార్యంతో మున్సిపల్ బస్టాండ్‌లో తాగునీరు, మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన మున్సిపల్ మేనేజర్ మోహన కుమారిని కౌన్సిలర్లు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సి పల్ ఏఈలు జూపల్లి ప్రసాద్, వరలక్ష్మిలు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

అనంతసాగరం, జూన్ 29: జులై 1న లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో తాజ్ మస్రూర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఇంటి వద్దే అందుబాటులో ఉండాలని కోరారు. సచివాలయాల్లో పనిచేసే అన్ని విభాగాల సిబ్బందితో ఈ నగదు పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు.

ఇసుక రీచ్ రహదారికి గండి



ఇసుక రీచ్ బాటకు గండి కొట్టుతున్న దృశ్యం

సంగం, జూన్ 29: వెంగారెడ్డిపాళెం వద్ద పెన్నానది ఇసుక రీచ్‌లోకి వెళ్లే రహదారికి శనివారం రెవెన్యూ అధికారులు గండి కొట్టించారు. కొందరు అక్రమార్కులు రాత్రివేళ ఇసుక అక్రమంగా తరలిస్తుండటంతో తహసీల్దారు ఆదేశాల మేరకు వీఆర్వో శోభన్‌బాబు కందకాలు (గండి) ఏర్పాటు చేశారు. దీంతో ఇసుక అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది.

గండిపాళెం వాసికి గోల్డన్ నంది అవార్డు

ఉదయగిరి, జూన్ 29: గండిపాళెం జీవీ గిరీష్ కుమార్ హైదరాబాదులో మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వహించిన గ్లోబల్ అవార్డ్స్ సెలబ్రేషన్స్-2024లో గోల్డన్ నంది అవార్డు శనివారం అందుకున్నారు. ప్రకృతి నివాస్ పేరుతో జిల్లాలో పేద విద్యార్థులకు చేసిన సేవలను గుర్తించి సంస్థ ఆయనకు నంది అవార్డును అందజేసింది.

విద్యా సామగ్రి పంపిణీ



వరికుంటపాడు, జూన్ 29: అలివేలుమంగాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం దాతలు తూర్పుబోయమడగలకు చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాదిండ్ల పెదనారయ్య, బూత్ కమిటీ కన్వీనర్ పావులూరి పుల్లయ్య, యువనాయకులు ఏనుగంటి నరేంద్రలు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



పుష్పాలంకరణలో మానసాదేవి అమ్మవారు



ఉలవవారిపాళెంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయగిరి రూరల్, జూన్ 16: సున్నంవారిచింతల కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణా న్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారిని ప్రత్యే కంగా అలంకరించి మంత్రోచ్ఛర ణలతో శాస్త్రోక్తంగా కల్యాణం చే పట్టారు. గ్రామంతో పాటు పరి సర గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

దుత్తలూరు: నర్రవాడ పంచాయతీలోని ఉలవారిపాళెం కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవాన్ని చేపట్టారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు అంకాళమ్మకు పొంగళ్లు

నర్రవాడలో ఆదివారం మేకపాటి వంశీయుల ఇలవేల్పు అంకాలమ్మకు పాలపొంగళ్లు నిర్వహిస్తున్నట్లు కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారన్నారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల మానసాదేవి అమ్మవారు శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారిని మేళాతాళాలు, బాణాసంచా పేలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు చండీ, నవగ్రహ హోమాలు, మహానివేదన తదితర పూజలు నిర్వహించారు.

నేటినుంచి మహోత్సవాలు

గువ్వాడి గంగాభవాని కొలుపుల మహోత్సవాలు ఆదివారం నుంచి నిర్వ హించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు అమ్మవారికి జల్దిస్నానం, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

నందిగుంటలో మాతమ్మ తల్లి తిరుణాల ప్రారంభం

వింజమూరు: నందిగుంట మాతమ్మ తల్లి తిరుణాల ప్రారంభం అయ్యింది. మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గంగపట్ల వెంగయ్య సతీమణి మహేశ్వరిలు ప్రత్యేక పూజలు చేశారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం చేస్తే చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, జూన్ 29: పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ భార్గవి హెచ్చరించారు. శనివారం ఆమె సీతారామపురం బిట్-1 సచివాల యంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. జూలై 1వ తేదీ ఉదయం 6గంటల నుంచి పింఛన్ పంపిణీ సజావుగా జరగాలని, సిబ్బందికి కేటాయించిన పింఛన్‌దారుల ఇంటి వద్ద కు వెళ్లి నగదును అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంనాథ్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి, జూన్ 29: జీ.చెరువుపల్లి పంచాయతీలోని సంజీవరాజుపల్లిలో అధికారులు శనివారం మురుగునీటి నిల్వలను తొలగించి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో 'కొరవడిన పారిశుధ్యం' అనే కథ నంపై కార్యదర్శి కరీముల్లా స్పం దించారు. తన సిబ్బందితో వెళ్లి మురుగునీరు పారేలా చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లించారు.

వెంగమాంబ సన్నిధిలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానించిన టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 29: మండలంలోని నర్రవాడ వెలసిన శ్రీవెంగమాంబ పేరంటాలమ్మను శనివారం తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల నియోజకవర్గ శాసనసభ్యులు అనిరుధ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే అమ్మవారిని దర్శించుకొంటానని మొక్కుకొన్నానని, ఆ మొక్కు తీర్చుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఉలవారిపాళెం వెంగమాంబ సేవా సమితికి నిత్యాన్నదానాకి రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం ఆయన్ను టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాదాల రామ చంద్ర, మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్యనాయుడు, నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, మాదాల తిమ్మయ్య, చిన తిమ్మయ్య, దుశ్యంత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, వంశీరెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా ప్రవేశ కార్యక్రమంపై అవగాహన

ఉదయగిరి రూరల్, జూన్ 29: స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు విద్యాప్రవేశ కార్యక్రమంపై శనివారం ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జులై 25వ తేదీలోపు ప్రవేశాలను పూర్తి చేయాలన్నారు. ప్రవేశ వివరాలను దీక్ష యాప్‌లో నమోదు చేయించాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



జమీర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూన్ 29: స్థానిక బీసీ కాలనీలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ జమీర్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జమీర్‌ను ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, తోటి ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగయ్య పాల్గొన్నారు.

కేశవులుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పోలీసులు

కలువాయి, జూన్ 29: బలిమెల రిజర్వాయర్ ఘటనలో అసువులుబాసిన కలువాయి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక బస్టాండు సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పోలీసులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అయ్యప్ప, కేశవులు తల్లిదండ్రులు చెన్నయ్య, పెంచలమ్మ పాల్గొన్నారు.

చిన్ననోట్ల కొరత.. చిల్లర కష్టాలు..

ఉదయగిరి, జూన్ 29: గత కొంతకాలంగా చిన్న నోట్ల కొరత ఏర్పడింది. చిల్లర కోసం సామాన్య ప్రజలు, వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో ప్రయాణికులు కండక్టర్ల మధ్య చిల్లర కోసం గొడవలు చేసుకుంటున్నారు. చిన్న నోట్ల కోసం పడే కష్టాలు అనీఇన్నీ కావు. ఫోన్ పే కొందరికి ఉన్నా కొన్నిసార్లు సిగ్నల్ అందకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఫోన్‌పే, గూగు ల్ పే లాంటి వాటిని కొన్ని ప్రాంతాల్లో కొన్ని దుకా ణాల్లో అను మతించకపోవడంతో ఖచ్చితంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. అయితే దుకాణదారుడు వద్ద వినియోగదారుడు సరిపడినంత చిల్లర లేకపోవడంతో సరుకులు ఇవ్వకుండా వెనక్కు పంపే సందర్భాలున్నాయి. రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లు అందడం కష్టమైంది. ప్రతిఒక్కరూ రూ.500 లు ఇస్తుండడంతో చిల్లర్లు లేక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

వలేటివారిపాలెం: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం చేయవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెంలో శనివారం డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ

- వైసీపీ వర్గీయుల ముమ్మర ప్రయత్నాలు
- అధికారులను లెక్కచేయని వైనం
- సర్పంచ్‌పై తిరగుబాటు.. వారించిన గ్రామస్థులు



సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర

అల్లూరు, జూన్ 29: మండలంలోని పడమర గోగులపల్లిలో శనివారం పంచాయతీ స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీ వర్గీయులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్రలు సంఘటనా స్థలానికి వెళ్లి సదరు ఆక్రమణదారులను అడ్డుకున్నా వారిని సైతం లెక్కచేయకుండా వ్యవహరించారు. దీన్ని గమనించిన స్థానికులు ఆక్రమణదారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణకు పాల్పడడమే కాకుండా అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్నారని వారిని వారించారు. సర్పంచ్ ఆట తిరుమల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఓవర్ హెడ్ ట్యాంక్‌లోని వృథా నీరు పక్కనే ఉన్న వాగులోకి వెళ్లేలా ఏర్పాటు చేసి ఉన్న స్థలం పంచాయతీది. ఈ స్థలం తమదని కొంతమంది వైసీపీ వర్గీయులు గత కొన్ని సంవత్సరాల నుండి ఇబ్బంది పెడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో సీసీ రోడ్డును పగులగొట్టి పైప్‌లైన్ ఏర్పాటు చేసి వృథా నీటిని పంపించి సదరు స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని చేపట్టారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రతిసారీ వారు సర్పంచ్‌పై వాగ్వివాదానికి దిగుతున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఈ గ్రామం టీడీపీ సర్పంచ్ గెలుపొందడంతో అప్పటి నుండి ఏ అధికారి, ఏ నాయకుడూ పంచాయతీ నిర్వహణకు సహకరించకపోగా అడ్డుకట్ట వేసేవారు. కనీసం పంచాయతీ కార్యదర్శి కూడా స్పందించకుడా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని సర్పంచ్ వాపోయారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్రలు సంఘటనా స్థలాన్ని పరిశీలనకు వచ్చారని తెలిపారు. ఆక్రమణదారులను ప్రశ్నించగా అధికారులను సైతం వారు లెక్కచేయకుండా వ్యవహరించడంతో వారు వెనుతిరిగారని చెప్పారు. అధికారులు సైతం వైసీపీ వర్గీయుల ధాటికి తట్టుకోలేకపోతున్నారని ఇంకా వైసీపీ నాయకుల మాటలను తూచా తప్పకుండా పాటిస్తున్నారని, సమస్యలను పరిష్కరించకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న అలాంటి వారి మాటలను పట్టించుకోకుండా సమస్యను పరిష్కరించాలని స్థానికులు చెబుతున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఇంటూరి



కందుకూరు, జూన్ 29: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో శనివారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం కోసం సలహాలు తీసుకున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను, తక్షణం చేపట్టాల్సిన వివిధ పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

డ్వామా అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కందుకూరు, జూన్ 29: నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం అమలుతీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం డ్వామా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధి హామీ పథకానికి సంబంధించి గతంలో చేసిన పనులు, పురోగతిని ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో చేపట్టబోయే పనుల ప్రతిపాదనలను మండలాల వారీగా అధికారులు ఆయనకు వివరించారు. గత ప్రభుత్వంలో జలకళ ద్వారా నియోజకవర్గం మొత్తంమీద 430 బోర్లు వేయగా కేవలం ఐదు బోర్లుకు మాత్రమే మోటార్లు బిగించటం జరిగిందని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇకముందు చేపట్టబోయే పనుల్లో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీడీ మృధుల, ఏపీఓలు, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మం కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ



వీరబ్రహ్మం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాకర్ల

కొండాపురం, జూన్ 29: శెట్టిపాలెం పంచాయతీలోని తూర్పుజంగాలపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు గూడ్లూరు వీరబ్రహ్మం రెండు రోజుల క్రితం గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి పార్టీ తరఫున అన్ని విధాలుగా ఆదు కుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల టీడీపీ నాయకులు ఉన్నారు.

సచివాలయంలో పీఎం, సీఎం చిత్రపటాల ఏర్పాటు



మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు దిష్టితీస్తున్న టీడీపీ నేతలు

జలదంకి, జూన్29: కేశవరం పంచాయతీలోని తిమ్మసముద్రం గ్రామ సచివాలయంలో పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను ఎన్డీఏ కూటమి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్రపటాలతోగ్రామంలో ప్రదర్శన వచ్చి గుమ్మడికాయతో దిష్టితీసి సచివాయంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తల్లపనేని మదుసూదన రావు, కంచర్ల వినోద్‌నాయుడు, గద్దె బ్రహ్మయ్యయాదవ్, చిన్నబ్బయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



కంపోస్ట్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

కావలి, జూన్ 29: పారిశుధ్య మెరుగుదలకు తీసుకునే చర్యలలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శనివారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తెల్లవారుజామున రెండోడివిజన్‌లో పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసి అక్కడకు ఎంత మంది కార్మికులు ఉండాలి.. ఎంత మంది వచ్చారో తనిఖీ చేశారు. అలాగే అక్కడే మరమ్మతులకు గురైన మున్సిపల్ చెత్త తరలించే వాహనంతో పాటు మరికొన్ని పాడై పోయిన వాహనాలను పరిశీలించి వాటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంపోస్ట్ యార్డును పరిశీలించారు. వెంగాయగారిపాలెం రోడ్డులో ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను వెంటనే ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

'నేను బడికిపోతా'పై హెచ్‌ఎంలతో సమావేశం

కొండాపురం: నేను బడికిపోతా కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం ఎంఈవో-2 ఆనందరావు సమావేశమయ్యారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమాలపై ప్రతి ప్రధానోపాధ్యాయుడు అవగాహన కలిగి తమ పరిధిలోని పిల్లలను గుర్తించాలన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కావలి, జూన్ 29: డాక్టర్స్‌డేను పురస్కరించుకుని పలు స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కావలి పట్టణంలో మూడుచోట్ల మెగా రక్తదానశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ కావలి శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. సుబ్బారావు, గోపిలు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మునుసూరు ఐఎంఏ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని రెడ్‌క్రాస్ భవన ఆవరణలో క్రిష్టియన్‌పేట మూడోలైన్‌లోని గీతాంజలీ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటలవరకు ఆసక్తి ఉన్న రక్తదానం చేయవచ్చన్నారు.

ప్రమాదకర చెట్టు కొమ్మలు తొలగింపు

కావలి రూరల్, జూన్ 29: స్థానిక వాయునందన ప్రెస్‌వీధిలోని వినాయకుని గుడి సమీపంలో ఎత్తుగా పెరిగి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను శనివారం స్థానికులు క్రేన్ సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. చెట్టుకు సమీపంలో ట్రాన్స్‌ఫారం కూడా ఉండటంతో రానున్న వర్షాలకు చెట్టు కూలినట్లయితే ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు భావించారు. చెట్టు కొమ్మలు కొట్టేటప్పుడు ఇళ్లు, విద్యుత్ తీగలపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలోని పెద్ద వృక్షాల తలకొమ్మలు కొట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ భద్రత మధ్య పింఛన్ నగదు డ్రా

కావలి, జూన్ 29: పట్టణంలోని 10,260 మంది పింఛదారులకు సోమవారం అందజేసే నగదును శనివారం కావలి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి నుంచి డ్రా చేశారు. పెంచిన వెయ్యి రూపాయలతో జూలై నెల నుంచి ఇచ్చే రూ.4వేలు కాక అదనంగా ఏప్రిల్ నుంచి ఇస్తానని సీఎం చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం అదొక రూ.3 వేలు మొత్తం రూ.7వేలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇలా పట్టణంలోనే సుమారు రూ.7.18కోట్ల నగదు అవసరం అవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌బీఐ బ్యాంకు నుంచి శనివారం నగదును డ్రా చేశారు. ఆ నగదును కావలి ఒకటో పట్టణ సీఐ రాజేష్, వారి సిబ్బంది భద్రతతో సచివాలయాల వారీగా సచివాలయ సిబ్బందికి అందజేశారు. సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల సమక్షంలో ఫించన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదును అందచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

1న ఇంటివద్దే పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, జూన్ 29: మండలంలోని అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులకు జూలై 1వ తేదీన ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో యు శేషుబాబు శనివారం తెలిపారు. పింఛన్ల పంపిణీ రెండురోజుల్లో పూర్తిచేయడం జరుగుతుందన్నారు. 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 90 శాతం పంపిణీ చేయడం జరుగుతుందని, మిగిలిన పింఛన్లను 2వ తేదీ పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. లబ్ధిదారులు ఈ రెండు రోజులు తప్పనిసరిగా ఇళ్లవద్ద ఉండి పింఛన్లు తీసుకోవాలని ఆయన కోరారు.

వలేటివారిపాలెం: వచ్చేనెల 1వ తేదీన ఇళ్లవద్దకే సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది వచ్చి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు వెళ్లనవసరం లేదని తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 10,98,753

వలేటివారిపాలెం, జూన్ 29 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 10,98,753 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6,800, కుంకుమార్చన ద్వారా రూ. 30,080, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 490525, వాహన పూజలు ద్వారా రూ. 6,580, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,37,200, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 900, రూముఅద్దెలు ద్వారా రూ. 33,780, కవర్లు ద్వారా రూ. 7,200, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,10,575, అన్నదానం ద్వారా రూ. 4,03,113, విరాళముల ద్వారా రూ. 12 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

బీఎమ్మెస్‌లో విలీనమైన వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్

కావలి టౌన్, జూన్29: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ బీఎమ్మెస్ యూనియన్‌లో విలీనమైంది. శనివారం సాయిక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు సీ.రామగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టీ సాంబశివరావులు పాల్గొన్నారు. కోటేశ్వరరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కావలి, ఆత్మకూరు డివిజన్లకు చెందిన 100మంది కార్మికులు బీఎమ్మెస్ సభ్యత్వం తీసుకున్నారు.

రాళ్లపాడు గేట్లకు గ్రీజు పెట్టించిన అధికారులు

లింగసముద్రం, జూన్ 29: రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసి రాళ్లపాడు ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటిని ప్రాజెక్టు గేట్ల ద్వారా మన్నేరుకు విడుదల చేసేందుకు డీఈ పి లక్ష్మీనారాయణ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పాత స్పిల్‌వే గేట్ల చైన్లకు గ్రీజు పెట్టించారు. కొత్త స్పిల్‌వేలోని రేడియల్ గేట్ల రోప్స్‌కు కాడ్మియమ్ కాంపౌండ్ పెట్టించారు. దీనివలన వరదల సమయంలో గేట్లు సులువుగా పైకి లేస్తాయని డీఈ లక్ష్మీనారాయణ చెప్పారు. అలాగే ప్రాజెక్టు పాత స్పిల్‌వే గేట్ల వద్ద ఉన్న నీటిమట్టం తెలిపే గేజ్‌కు కూడా పెయింట్ వేయించి, నీటిమట్టం తెలిపే అంకెలను కూడా వేయించారు.

పోలేరమ్మకు పూజలు

లింగసముద్రం, జూన్ 29 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో పోలేరమ్మ ఆలయం 3వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులు శనివారం అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి బండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

రేపటి నుంచి నగరంలో డయేరియా సర్వే

నెల్లూరు(సిటీ), జూన్ 29 : నెల్లూరులోని అన్ని డివిజన్ల పరిధిలో గడప గడపకు సోమవారం నుంచి డయేరియా సర్వే నిర్వహించనున్నట్లు ఎస్‌ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బందితో పాటు ఆరోగ్య విభాగం అధికారులు ఈ సర్వే నిర్వహిస్తారని, ప్రజలంతా వారికి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి వచ్చి ప్రజల్లో డయేరియా లక్షణాలు పరీక్షించడం, నీటి లభ్యత, చెత్త సేకరణ, మంచినీటి నిల్వ వంటి అంశాలపై సర్వే జరుగుతుందన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. తాగునీటి పైపులైన్ల లీకేజీల పైనా ఆరా తీస్తున్నామన్నారు.

సీతారామ మందిరంలో భాగవత సప్తాహం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : బాలాజీనగర్ సీతారామ మందిరంలో శనివారం పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ కాథామతం భాగవత సప్తాహం జరిగింది. డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు శ్రీకృష్ణతత్వంపై ప్రసంగించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలవరపు లక్ష్మీనరసింహారావు, అవధాని కోటరాజశేఖర్, ఎం.చంద్రశేఖర్, సూరం శ్రీనివాసులు, తదితరు లు పాల్గొన్నారు.

నేడు రంగనాథుడికి జ్యేష్టాభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : రంగనాయకులపేట తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం రేవతీ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి జ్యేష్టాభిషేకం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తలు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివార్లకు 10 కేజీల తేనెతో అభిషేకం చేస్తారని పేర్కొన్నారు. సాయంత్రం గోపురోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు తరలివచ్చి కార్యక్రమాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు తెలిపారు.

మహావిష్ణువుకు హనుమంత సేవ



హనుమంత సేవలో పూజలందుకుంటున్న మహావిష్ణువు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గల గురువాయుర్ మహావిష్ణువు ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గురువాయూర్ మహావిష్ణువు హనుమంత వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం మహాకుంభారాధన, నిత్యహోమం, శాత్తుముర్రై, మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, మహాలక్ష్మీయాగం, లక్ష్మీగాయత్రి హోమాలు జరిగాయి. ఈ ఉత్సవాలను ఉభయకర్తలు, ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

రొట్టెల పండుగకు పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : రొట్టెల పండుగ విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఏర్పాట్లకు సంబంధించి శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొట్టెల పండుగకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఇప్పటికే మంత్రులు పీ.నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. రొట్టెల పండుగకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నేత సయ్యద్ సమీ, సాబీర్‌ఖాన్, మతపెద్ద అబూబకర్, ఎంహెచ్‌వో వెంకటరమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎత్తు, వంకర పళ్లకు ఆధునిక చికిత్స

● నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ రెజినాల్డ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), జూన్ 29: నారాయణ దంత ఆసుపత్రిలో జూలై 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు ఎత్తు, వంకర పళ్లకు రాయితీతో ఆధునిక చికిత్స అందిస్తున్నట్లు నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు సిరామిక్ బ్రేస్, సెల్ఫ్ లైగేటింగ్ బ్రేస్, ఫంక్షనల్ అప్లయెన్సెస్, క్లియర్ అలైనర్స్ వంటి చికిత్సలకు 50 శాతం రాయితీతో వైద్య చికిత్సలు అందచేస్తామని తెలిపారు. నారాయణ దంత కళాశాల కో ఆర్డినేటర్ డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ 9 రకాల స్పెషాలిటీ వైద్య సేవలు, 92 మంది దంత వైద్యులు, 300లకుపైగా డెంటల్ కుర్చీలు కలిగిని ఏకైక ఆసుపత్రి నారాయణ దంత వైద్యశాలేనన్నారు. ఆర్థోడాంటిస్ట్ డాక్టర్ మండవ ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో నైపుణ్యం కలిగిన వైద్యులు, అత్యంత ఆధునిక పరికరాలు ఉన్నాయన్నారు. ఈ ప్రత్యేక ప్యాకేజీ కోసం 7331170047ను సంప్రదించాలని తెలిపారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ వివేక్‌రెడ్డి, నారాయణ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి, ఏవో ఉన్నం అరవిందరెడ్డి పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణకు 'ఆదాల' సిద్ధమా..?

● 16 ఏళ్లనాటి బిల్లులు రూ.67 కోట్లకు స్కెచ్ ● గుర్తించి రద్దు చేసిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం : టీడీపీ నేత

నెల్లూరురూరల్, జూన్ 29 : 16 ఏళ్ల క్రితం పనులు చేసినట్లు సుమారు రూ.67 కోట్లకు జగన్ ప్రభుత్వంలో పొందేందుకు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వేసిన భారీ స్కెచ్‌ను టీడీపీ ప్రభుత్వం గుర్తించి నిలిచివేసిందని, ఇందులో దాగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదాల సిద్ధమా..? అని టీడీపీ నేత సూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరురూరల్లో శ్రీధర్‌రెడ్డిపైన పోటీ చేయాలంటే 16ఏళ్ల క్రితం ఏపీఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరిట చేసిన పనులకు నిధులు మంజూరు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డిని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేశారని వెల్లడించారు. ఈ క్రమంలో ఆ నిధులు చెల్లింపుకు సీఎఫ్‌ఎంఎస్ ఐడీని కూడా క్రియేట్ చేసి నిధులు డ్రా చేసేందుకు సిద్ధం కాగా ఈ లోపు ప్రభుత్వం మారడంతో వాస్తవాన్ని గ్రహించిన టీడీపీ సర్కారు ఆ నిధులను నిలిపివేసిందని తెలిపారు. అప్పట్లో పనులు జరిగాయో లేదో తేల్చడానికి విజిలెన్స్ విచారణ చేయాల్సి ఉందన్నారు. పెద్ద మనిషి ముసుగులో ఉన్న మోసగాడు ఆదాల అనడానికి ఇదో నిదర్శనమని పేర్కొన్నారు.

టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వద్దు : బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 29 : నెల్లూరులో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు అనుమతించవద్దంటూ ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డికి శనివారం బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మిడతల రమేష్, దాసరి రాజేంద్ర మాట్లాడుతూ 17వ శతాబ్దంలో టిప్పు సుల్తాన్ 8వేల ఆలయాలను ధ్వంసం చేశారన్నారు. కేరళలో 4 లక్షల హిందువులను మతం మార్చారని, మతం మారని హిందువులను సామూహిక ఊచకోత కోశారన్నారు. భారతీయ జనతా పార్టీ టిప్పు సుల్తాన్ విగ్రహాలకు, ఉత్సవాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు చిట్టిబాబు, సుధాకర్, రత్నంనాయుడు, ఆదినారాయణ, కృష్ణ నాగేంద్రసింగ్, ప్రభాకర్‌యాదవ్, నారాయణ యాదవ్, సుజన తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో బీపీటీ 5204 విత్తనం

నెల్లూరు (వ్యవసాయం) : నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో బీపీటీ 5204 వరి విత్తనం అందుబాటులో ఉందని కేవీకే సేద్య విభాగం శాస్త్రవేత్త కిరణ్ కుమార్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 30కేజీల బస్తా రూ.1260లకు అందుబా టులో ఉందని, అవసరమైన రైతులు 7981644675 నెంబరును సంప్రదించాలని కోరారు.

దుకాణాల్లో పవన్‌కల్యాణ్ చిత్రపటం ఏర్పాటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 29: ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని ఆయన అభిమానులు, సానుభూతి పరులు వారి దుకాణాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారని ఆ పార్టీ నాయకుడు టోనీబాబు తెలిపారు. నగరంలోని సుబేదారిపేట సెంటర్‌లో జనసేన పార్టీ నాయకులు మాధవ్‌కు టోనీబాబు శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాన్ని అందజేయగా ఆయన తన దుకాణంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శ్రీను, సూరి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేస్తున్న జనసైనికులు

మన ఫొటోలే జ్ఞాపకాలకు చిహ్నాలు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : కెమెరాలు, ఫొటోగ్రఫీలలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో తీసిన మన ఫొటోలు మన జ్ఞాపకాలకు చిహ్నాలుగా దాచుకుంటున్నామని సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం సరస్వతీనగర్‌లోని విశ్వభారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో జాతీయ కెమెరా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫొటోగ్రఫీపై పోటీలు జరిగాయి. ఉత్తమ ఫొటోలు తీసిన విజేతలకు మురిగపూడి ట్రస్ట్ బహుమతులు అందజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రత్నయ్య పాల్గొన్నారు.

నేడు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : నగరంలోని రంగనాయకులపేట ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి 8గంటలకు అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుందని అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి అరవేటి వెంకటఫణీంద్రకుమార్, కోశాధికారి భోగనాథం సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నారద మహర్షి జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 29 : నగరంలోని ఆచారివీధిలో నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఉదయం దేవర్షి నారదమహర్షి జయంతి సందర్భంగా పాత్రికేయ సన్మాన సభ జరుగుతుందని సాహితీ సుధా ఫౌండేషన్ ఉదయ్‌కుమార్, మనోహర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డీఎస్పీ కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యవక్తగా చుండూరు సాయివెంకటసత్యనారాయణ పాల్గొంటున్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

● నగర పంచాయతీ కమిషనర్‌కు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశం



నగర కమిషనర్‌తో మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 29: ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నగర పంచాయతీ కమిషనర్ రమణబాబును ఆదేశించారు. పలువురి ఫిర్యాదుల మేరకు శనివారం బుచ్చిలోని నగర పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో సిబ్బంది విధులు, నిధులు తదితర వివరాలు అడిగి తెలుసుకుని స్థానిక ప్రజల సమస్యలు గురించి ఆరా తీశారు. పన్నుల పెంపు, తాగునీరు, డ్రైన్లు, పారిశుధ్యం తదితర సమస్యలపై పలువురు నాయకులు, కౌన్సిలర్లు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ప్రధానంగా బుచ్చి బస్టాండ్ సెంటర్లో ప్రయాణికులకు మరుగుదొడ్ల సౌకర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో కోవూరు నియోజకవర్గంలో డయేరియా వ్యాధి ప్రబలకుండా వుండేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ముందుగా ప్రశాంతిరెడ్డి టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు వైష్ణవి, కల్యాణ్, టీడీపీ నాయకులు హరికృష్ణ, ఎంవీ శేషయ్య, హరనాథ్, బచ్చాబాయ్, శ్రీనివాసులు, రామానాయుడు, నరసింహస్వామి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెన్షన్‌ల పంపిణీని విజయవంతం చేయండి

నెల్లూరు(హరనాథపురం) : జులై 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. శనివారం నగరంలోని ఆమె నివాసంలో ఎంపీడీఓలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని స్థానిక నాయకుల సహకారంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదివర్తి ఇసుక రీచ్‌లో తవ్వకాలు జరిపితే చర్యలు

విడవలూరు, జూన్ 29: ముదివర్తి ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలపై శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జిల్లాధికారులు స్పందించారు. ఈమేరకు రెవెన్యూ అధికారులు శనివారం ఇసుక రీచ్‌ని పరిశీలించి తవ్వకాలు జరుగుతున్నాయా, లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ ముదివర్తి ఇసుక రీచ్‌లో తవ్వకాలకు అనుమతులు లేవని, ఎవరైనా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీజీబీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



క్యాషియర్, క్లర్క్‌ను సత్కరించిన బ్యాంకు సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 29: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు క్యాషియర్ బొల్లు రామ్మోహన్, క్లర్క్ డి కరుణాకర్ సేవలు అభినందనీయమని పలువురు ఖాతాదారులు అభినందించారు. జొన్నవాడలోని ఏపీజీ బ్యాంకులో పని చేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రామ్మోహన్, కరుణాకర్‌లను బ్యాంకు మేనేజరు కే సురేష్, అసిస్టెంట్ మేనేజరు ఆదినారాయణ, ఖాతాదారులు తదితరులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కొడవలూరు, జూన్ 29: మండలంలోని గండవరం గ్రామంలో ఉదయకాళేశ్వరస్వామి ఆలయంలో శనివారం జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా కోనేరులో పేరుకుపోయిన చెత్త, బురదను తొలగించి మరమ్మతులు నిర్వహించారు. భక్తులు సేదతీరేందుకు నిర్మిస్తున్న రేకుల షెడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతులు కల్పిస్తున్నామన్నారు. ఆలయాన్ని అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు ఆలం మాలకొండయ్య, తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కొడవలూరు, జూన్ 29: విద్యార్థులకు ఉన్నత విద్యను అందించినప్పుడే వారు అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని వెంకటేశ్వర కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి గుణశేఖర్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ కళాశాలలో విద్యార్థులను ఎంపిక చేసుకునేందుకు పోటీ పడుతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంజనీరింగ్ కోర్సులపై అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించండి

● ఎమ్మెల్యే సోమిరెడ్డికి కొలనుకుదురు గ్రామస్థుల వినతి



సోమిరెడ్డిని కలిసిన కొలనుకుదురు గ్రామస్థులు

మనుబోలు, జూన్ 29: తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కొలనుకుదురు గ్రామస్థులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారు. శనివారం ఎమ్మెల్యేను నెల్లూరులోని ఆయన నివాసం వద్ద గ్రామస్థులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తెలపడంతో ఎమ్మెల్యే వెంటనే చరవాణి ద్వారా గ్రామీణ నీటి సరఫరా డీఈకి సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మిశెట్టి శీనయ్య, ఆత్మకూరు సురేష్, ఆత్మకూరు పెంచలయ్య, రవితేజ, కృష్ణ, అమీర్, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

కసుమూరు దర్గాలో సోమిరెడ్డి సింధురెడ్డి పూజలు

వెంకటాచలం : మండలంలోని కురిచెర్లపాడు, కసుమూరు గ్రామాల్లో శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి పర్యటించారు. చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కురిచెర్లపాడుకు చెందిన రామ్మూర్తి దంపతులు మగ్గంపై నేసిన చీరను సింధురెడ్డికి బహూకరించారు. తొలుత కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, తెలుగు మహిళా అధ్యక్షురాలు దువ్వూరు లక్ష్మమ్మ, ఆయా గ్రామాల ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

మహాలక్ష్మమ్మకు టీడీపీ నేతల పూజలు

తోటపల్లిగూడూరు, జూన్ 29: సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలిచి టీడీపీ అధికారంలోకి రావడంతో మండలంలోని వీలుకానిపల్లిలో శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారికి శనివారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, బీసీ నాయకులు మన్నెం జితేంద్రగౌడ్, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, మొగలిగుంట పోతన, స్థానిక సర్పంచ్ గోపిరెడ్డి పావని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తిరుమలలో మొక్కు తీర్చుకున్న టీడీపీ నేత

విడవలూరు: సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులు గెలవడంతో టీడీపీ మండల అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు శనివారం తిరుమలకు వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 424 కేసుల పరిష్కారం

కోవూరు, జూన్ 29: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 424 కేసుల్ని పరిష్కరించారు. 360 క్రిమినల్, 19 సివిల్, 45 బ్యాంకు కేసుల్ని పరిష్కరించారు. రూ. 27లక్షల నగదును కక్షిదారులు బ్యాంకులకు జమచేశారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి చైతన్య, మేజిస్ట్రేట్ కాత్యాయని పాల్గొని కేసుల్ని పరిష్కరించారు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు సిబ్బంది. కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు, దగదర్తి పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కసుమూరులో ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం, జూన్ 29: మండలంలోని కసుమూరు పంచాయతీ షాపాబావి వడ్డిపాళెం వద్ద స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మండవ ఫౌండేషన్ పశువైద్యాధికారి డాక్టర్ వీ శ్రీనివాసులునాయుడు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పాడిరైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు రామరాజు, గోపాల్ మిత్రలు జీ రాము, శ్రావణ్‌కుమార్, సుమిత్ర, సుధీర్, పాడిరైతులు పాల్గొన్నారు.

ఇంటివద్దే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

మనుబోలు, జూన్ 29: సామాజిక పింఛన్లను జూలై 1వ తేదీన లబ్ధిదారులకు ప్రభుత్వ ఉద్యోగులే ఇంటివద్దకు వచ్చి పంపిణీ చేస్తారని మండలపరిషత్ కార్యాలయం ఏవో రవికుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ పింఛన్లు ఇచ్చేందుకు మండలానికి ప్రభుత్వం రూ. 3.99కోట్లు మంజూరు చేసిందని ఆయన వివరించారు.

పడకేసిన డబుల్ డెక్కర్ !

రూ2.5 కోట్ల ప్రజాధనం వృథా



బస్సు పొడవు : 9 మీటర్లు
ఎత్తు : 4.5 మీటర్లు
వెడల్పు : 9 అడుగులు
సీట్ల సామర్థ్యం : 65
కొనుగోలు ధర: రూ2.14కోట్లు
(6శాతం పన్ను అదనం)

చిన్నయ్యగారు మోజుపడి ప్రజల సొమ్ముతో కొన్న రెండంతస్తుల బస్సు షెడ్డుకు చేరింది. తిరుపతి నగరంలో ఎర్రెర్రని నిగనిగలతో డబుల్ డెక్కర్ తిరుగుతూ ఉంటే ఎక్కడానికి జనం ఎగబడతారని వేసిన అంచనా తలకిందులైంది. భూమన అభినయ్ డిప్యూటీ మేయర్‌గా ఉన్నపుడు దాదాపు రూ2.5కోట్ల ప్రజాధనం పోసి తిరుపతి కార్పొరేషన్ కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోయింది. గత ఏడాది ఆగస్టు 8న రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులతో ఈ బస్సును కొనాలని కౌన్సిల్లో ప్రతిపాదించారు. ఆగమేఘాల మీద బస్సును కొనేశారు. మరి తిప్పేదెలా అని సందేహం వచ్చింది. ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. వారు నిరాకరించడంతో కార్పొరేషనే బస్సును నడిపి టికెట్లు వసూలు చేయాలని నిర్ణయించుకుంది. ఇరుకురోడ్ల నగరంలో ఇంతెత్తు బస్సు తిప్పడం కష్టం కావడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నరికి నేల కూల్చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా బస్సు చార్జీ రూ.50 అని నిర్ణయించారు. ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుందనుకున్నారు కానీ, రోజుకు పదిమంది కూడా ఎక్కలేదు. దీంతో బస్సును కొంతకాలం ఉచితంగానే తిప్పారు.అయినా జనం ఎందుకో పెద్దగా ఎక్కలేదు. ఇంతా చేస్తే బస్సుకు రిజిస్ట్రేషనే లేదు. ఏదైనా తేడా వస్తే తమ నెత్తికి వస్తుందని భయపడి, రవాణ అధికారులు అభ్యంతరపెట్టడంతో బస్సును బయటకు తీయడం మానేశారు. ప్రస్తుతం కార్పొరేషన్ చెత్త వాహనాలు పార్క్ చేసే వినాయకసాగర్ పక్కన ఈ ఎర్ర బస్సు ఈసురోమంటూ నిలబడి ఉంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

4 సెట్విన్ బస్సులు వచ్చేవి

తిరుపతిలో సిటీ బస్సులే లేకుండా పోయాయి. గతంలో తిరుచానూరు, చంద్రగిరి, రేణిగుంటలకు నగరం లోపలి నుంచి సిటీ బస్సులు ఇబ్బడిముబ్బడిగా తిరిగేవి. నగరంలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో వీటిని తగ్గించేశారు. జనం ఆటోల మీదే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. రూ.కోట్ల ఖర్చుతో సోకుల బస్సులు కొనే బదులు చిన్న సైజు సెట్విన్ బస్సులు కొని నగరంలో తిప్పితే ఆటోలు, బైకుల సంఖ్య కూడా తగ్గేది. ట్రాఫిక్ అవస్థలు తప్పేవి. ప్రజలకూ రవాణా అందుబాటులో ఉండేది.

లోక్ అదాలత్ విజయవంతం



తిరుపతిలో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి గురునాథ్

తిరుపతి(లీగల్), జూన్ 29: తిరుపతి జిల్లావ్యాప్తంగా కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైంది. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ పర్యవేక్షణలో తిరుపతిలో లోక్ అదాలత్ ఏర్పాట్లు చేశారు. కేసుల పరిష్కారం కొరకు 8బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచ్‌కు ఒక న్యాయమూర్తితో పాటు న్యాయవాది, ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. మొత్తం 287కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయమూర్తుల సమక్షంలో ఇరు పార్టీల న్యాయవాదులతో చర్చించి కేసులను రాజీ చేశారు. శ్రీకాళహస్తి కోర్టులో 150 కేసులను, సత్యవేడులో 58, పుత్తూరులో 85, పాకాలలో 16, నాయుడుపేటలో 112,వెంకటగిరిలో 223, సూళ్లూరుపేటలో 149,కోటలో 423, కేసులను పరిష్కరించారు.

టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ గ్యాస్ లీకేజీతో కలకలం

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం కలకలం సృష్టించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దనున్న ఈడీపీ ఆఫీస్‌లో శ్రీవారి దర్శన, ఆర్జితసేవల టికెట్లు, గదుల కేటాయింపు వంటి సమాచారాన్ని పొందుపరుస్తారు. శనివారం ఉదయం ఈడీపీ ఆఫీస్‌లోని ఓ ఏసీ కంప్రెసర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఫైర్ అలారం మోగింది. దీంతో విధుల్లోని సిబ్బంది ముందు జాగ్రత్తగా ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని ఏసీని పరిశీలించారు. ఏసీ నుంచి గ్యాస్ మాత్రమే లీకయ్యిందని, ఎలాంటి అగ్నిప్రమాదం జరగలేదని చెప్పడంతో ఈడీపీ కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వంలో దర్శన, ఆర్జితసేవా టికెట్ల కేటాయింపులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల స్టేట్ విజిలెన్స్ బృందం సోదాలు చేసి పలు రికార్డులను తీసుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నట్టు సమాచారం.

వర్సిటీల్లో రాజకీయ ప్రభావాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలి

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాల్లో నేతల పిలుపు



సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29: విద్యా కేంద్రాలన్నీ విద్యార్థి ఉద్యమ నిలయాలు కావాలని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు శనివారం తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో ప్రారంభమయ్యాయి.విద్యార్థి, రైతాంగ ఉద్యమాల్లో అమరులైన అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్‌లకు తొలుత నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో అధికార పార్టీకి ఊడిగం చేసేవారికి గత వైసీపీ ప్రభుత్వం పదవులు కట్టబెట్టిందని మండిపడ్డారు. ఎస్వీయూలో గతంలో ఎంపీ మిథున్‌రెడ్డి కటౌట్ ఏర్పాటు చేయడం వంటి సంఘటనలను ఇందుకు ఉదాహరణగా చెప్పారు. వర్సిటీల్లో రాజకీయ ప్రభావాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. చట్టసభలు కోటీశ్వరులతో నిండి పోయాయన్నారు. అందువల్ల విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. నీట్ వ్యవహారంపై ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయపడ్డారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కరుణాకరరెడ్డి నిలువెత్తు ఫ్లెక్సీని ఎస్వీయూ పరిపాలనా భవనానికి పెట్టడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. వర్సిటీల్లో ఇలాంటి సంస్కృతిని ఏ పార్టీ అధికారంలో ఉన్నా విడనాడాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ పాండా మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ అజెండాను పాఠ్యాంశాల్లో ప్రవేశపెడుతున్నారని, దీనిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సంఘమిత్ర, అమీన్ హంజా, మహేష్ కుంజం, జాతీయ కార్యదర్శులు కబీర్, షాహిద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి, నాయకులు ఫణీంద్ర, ఉదయ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, యూనివర్సిటీ నాయకులు చిన్న, చంద్ర, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు వెంకటరమణ, ప్రసాద్, జనార్దన్, మోహన్‌కుమార్‌రాజు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, కాళయ్య, విశ్వనాథ్, పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29: ఆకాశాన్నంటుతుండిన కూరగాయల ధరలు దిగి వచ్చాయి. మొన్నటి వరకు కిలో టమోటా రూ.100 పలికింది. అదేబాటలో ఉల్లి, వెల్లుల్లి, బెండకాయలు, ఆకుకూరలు ధరలు పోటీ పడ్డాయి. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్‌కు డిమాండ్ కంటే అధికంగా టమోటాలు రావడం, దిగుబడి పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం తిరుపతి మార్కెట్‌లో కిలో టమోటా రూ.50 పలుకుతోంది. ఉల్లి కిలో రూ.50 వరకు ఉంటోంది. బీన్స్, ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, బీరకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్ ధరలు కూడా తగ్గాయి. కిలో రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ఆకుకూర కట్టలు రెండు రూ.30, కొత్తిమీర కట్ట రూ.20, పుదీనా కట్ట రూ.20 లెక్కన విక్రయిస్తున్నారు. కిలో బెండకాయలు రూ.60, గోరుచిక్కుడు రూ.40, అనపకాయ రూ.50, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.80, బీరకాయలు రూ.60 చొప్పున అమ్ముతున్నారు.

'ఎవరు గెలిచినా మీదే గెలుపు'

విజేతలకు బహుమతుల అందజేత



తిరుపతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అనే అంశంపై ఆంధ్రజ్యోతి నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు శనివారం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నగదు బహుమతులను అందజేశారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల అంచనాలతో కూపన్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అలావచ్చిన వేలాదికూపన్లనుంచి ఇటీవల లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపికచేశారు. తిరుపతిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన పి.శ్రీనివాసులు ప్రథమ బహుమతిని, అలాగే మూడు ద్వితీయ బహుమతులను తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీకి చెందిన సీఆర్ ఖాదర్ బాషా, తిరుపతిలోని కుమ్మరతోపుకు చెందిన వి.మురళీకృష్ణ, చిత్తూరు గ్రీమ్స్‌పేటలోని గాయత్రీనగర్‌కు చెందిన ఈఎం ప్రసాద్‌లకు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలో గెలుపొందిన ఐరాలకు చెందిన పుల్లూరు మాధవన్ కూడా నగదు బహుమతి స్వీకరించారు.బ్రాంచ్ మేనేజర్ సురేష్ రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నాణ్యమైన విద్య బోధించాలి : డీఈవో



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న డీఈవో శేఖర్

గూడూరు, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని డీఈవో శేఖర్ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లు అందజేసి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారు చదువులలో రాణించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శాంతి, ఎంఈవో సనత్‌కుమార్, మస్తానయ్య, మాధవిలక్ష్మి, రఫూఫ్ పాల్గొన్నారు.

చిల్లకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో శేఖర్ సూచించారు. శనివారం మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి ఉపాధ్యాయులతో విద్యార్థుల బోధన, నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి వెనుకబడిన వారికి ప్రత్యేక బోధన అందించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి భోజనం చేశారు. ఎంఈవోలు సనత్‌కుమార్, రఫూఫ్, హెచ్‌ఎం చంద్ర, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సంయుక్త, వెంకటగిరిలో జడ్జి అనూష, మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిల్ కుమార్

నాయుడుపేట టౌన్, జూన్ 29 : కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గమని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త అన్నారు. కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారం కాగా... రూ.3,13,200 నగదు రికవరీ అయినట్లు తెలిపారు. పీపీ స్వాతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు పసల చెంగయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సులోచనరాణి

వెంకటగిరి : పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి అనూషా మొత్తం 223 కేసులు పరిష్కరించారు. న్యాయవాదులు బీరం మురళీకృష్ణ, బాబ్జి, గాంధీ, రాజేష్ పాల్గొన్నారు.

గూడూరు : కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్‌అదాలత్ నిర్వహించినట్లు న్యాయమూర్తి సులోచనరాణి అన్నారు. కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి లోకనాథం, న్యాయవాదులు, పోలీసు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట కోర్టు ఆవరణలో మొత్తం 149 కేసులు పరిష్కరించారు. న్యాయమూర్తి ఎస్.అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన లోక్‌అదాలత్‌లో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి క్రిమినల్ కేసులు 81, సివిల్ 17, బ్యాంక్ రికవరి 20, బీఎస్ఎన్ఎల్ 11, ఎస్‌టీసీఎస్ 20 మొత్తం 149 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. రెండో తరగతి అదనపు న్యాయమూర్తి సుబ్బారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు యాదవ్, క్రాంతికుమార్, లోక్ అదాలత్ సభ్యులు ధర్మాప్రసాద రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోట : కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ జరిగింది. జడ్జి భరత్‌కమల్ కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన కక్షిదారులు పలు కేసులకు సంబంధించి రాజీపడ్డారు. మొత్తం 423 కేసులు పరిష్కారమయ్యాయి.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్

ఇంటి రుచులతో భోజనం వడ్డించండి

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 29 : ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులకు ఇంటి రుచులతో భోజనం వండి వడ్డించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని 7వ వార్డులో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. స్థానికులు మంచి నీటి కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వస్తోందని చెప్పడంతో మున్సిపల్ కమిషనరును పిలిచి నీటి పంపిణీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే తాగునీటి కలుషితాన్ని అరికట్టాలని చెప్పారు. వర్షాల సీజన్ మొదలు కావడంతో వార్డుల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం క్రాస్ రోడ్డులోని హాస్టళ్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉదయం పూట పెడుతున్న అల్పాహారాన్ని పరిశీలించారు. గదుల్లో శ్లాబు ఊడి మీదపడుతోందని విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

● ప్రజాదర్బార్ నిర్వహిస్తాం

కష్టాల్లో వున్న ప్రజలను ఆదుకొనేందుకు త్వరలో ప్రజాదర్బార్ నిర్వహించి వారి సమస్యలకు పరిష్కారం చూపే చక్కటి కార్యక్రమాన్ని మొదలు పెడతామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గత ఐదేళ్ల నుంచి వైసీపీ పాలకులు ప్రజల సమస్యలు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ప్రజలకు అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ దృష్టికి తీసుకొస్తే అర్జీలను వాటిని సంబంధిత శాఖలకు పంపి వాటికి సత్వర పరిష్కారం లభించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యం, కాపా శ్రీనివాసులు నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, మంకు ఆనంద్, మల్లారపు బాబు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వైసీపీకి కీలక నేత రాజీనామా



బాలచంద్రారెడ్డి

తడ, జూన్ 29 : వైసీపీ కీలకనేత, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. దొరవారిసత్రం మండలానికి చెందిన ఆయన 2012లో వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి కీలక నేతగా ఎదిగారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ దువ్వూరు సేవలను గుర్తించి చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పదవి ఇవ్వడంతోపాటు పార్టీ రాష్ట్రస్థాయి పదవిని సైతం కట్టబెట్టింది. అయితే మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, ఆయనకు మధ్య పొరపచ్చాలు ఏర్పడ్డాయి. కిలివేటి వ్యతిరేక వర్గంగా రాజకీయం చేయడం ప్రారంభించారు. ఒకానొక దశలో కిలివేటికి మరోసారి ఎమ్మెల్యే సీటు ఇస్తే పనిచేసేది లేదని అధిష్ఠానానికి తెగేసి చెప్పారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే శనివారం తన వ్యక్తిగత కారణాలతో వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి అధిష్ఠానానికి లేఖ పంపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాయుడుపేట టౌన్, జూన్ 29 : మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ అరుణకుమారి తెలిపారు. శనివారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వాకాడు, జూన్ 29 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు నరసింహరావు సూచించారు. నిడిగుర్తి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పిల్లలను బాగా చదివించి ఉన్నతస్థాయికి ఎదిగేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వాకాటి సంపత్‌కుమార్, ఆర్ఐ సెల్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడికతీత పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకటగిరిటౌన్, జూన్ 29: పట్టణంలోని తోలిమిట్ట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైందని ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం రావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీలో పూడిక ఎత్తడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. చెత్తను జేసీబీతో ఎత్తడంతో ఆ ప్రాంతం గుంతగా ఏర్పడిందని, అక్కడ మురుగు ఏర్పడి దుర్వాసన వస్తోందని స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రెండు రోజుల్లో కొత్త మట్టిని తరలించి పరిష్కారం చూపుతామని తెలిపారు.

చెంగాళమ్మ సేవలో నరసింహ యాదవ్

సూళ్లూరుపేట, జూన్ 29: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ దర్శించుకొన్నారు ఆయనకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదపండితులతో ఆశీర్వచనం చేయించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్ యాదవ్, ఆలీభాయ్, మాధవ్, దాము, రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిబిరాలు

కోట, జూన్ 29 : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 9 రోజులపాటు జరిగిన ఎన్‌సీసీ నావెల్ నాల్గవ వార్షిక శిక్షణా శిబిరాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 649 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు హాజరయ్యారు. ఆయా క్యాడెట్‌లకు గన్ ఫైరింగ్, రిగ్గింగ్, షిప్ మోడలింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. నాలుగు విభాగాలలో విజేతలుగా గౌతం జ్ఞానేశ్వర్‌రెడ్డి, దివ్యశ్రీ, వెంకటేశ్వర్లు, కావ్యాలు విజేతలుగా నిలిచారు. ఆయా విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

కోటమ్మ ఉత్సవాలు ప్రారంభం



కోటమ్మ అభిషేకానికి సముద్రజలాలు తీసుకువెళ్తున్న నల్లపరెడ్డి కుటుంబీకులు

కోట, జూన్ 29 : కోట గ్రామ దేవత కోటమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి-కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో సముద్రజలాలను తీసుకువచ్చి అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేసి విశేష అలంకరణలో ఉంచారు. నల్లపరెడ్డి కుటుంబాల నుంచి కోటమ్మకు సారె, పూలబుట్టలను తీసుకొని ఆలయానికి మహిళా భక్తులు వెళ్లి అమ్మవారికి అలంకరించారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయా ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

పెళ్లకూరు, జూన్ 29 : మండలంలోని బంగారంపేట, మోదుగుపాళెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులతో కూడిన కిట్‌లను స్థానిక సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను సూళ్లూరుపేట వరకు పొడిగించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న నెలవల, వరప్రసాద్

నాయుడుపేట, జూన్ 29 : ప్రతి రోజూ గూడూరు నుంచి అమరావతికి వెళ్లే విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలును సూళ్లూరుపేట వరకు పొడిగించాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎంపీ వరప్రసాద్‌రావుతో కలసి విలేకర్లతో మాట్లాడారు. వరప్రసాద్‌రావు ఎంపీగా ఉన్న సమయంలో సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, ఓజిలి మండలాలలో అనేక అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారని, అలాగే నాయుడుపేటలో పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేశారని అన్నారు. చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో నిలుపుదల ఉందని, హైదరాబాదు నుంచి చెన్నైకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు నాయుడుపేటలో నిలుపుదల లేదని, ఆ మేర నిలుపుదల ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా సముద్రతీర ప్రాంతాల్లో తుఫాన్ షెల్టర్లకు కేంద్ర నిధుల కేటాయింపులో సహకరించాలన్నారు. పులికాట్ ముఖద్వారాల పూడికతీతకు దోహదపడాలన్నారు. మాజీ ఎంపీ వరప్రసాద్ మాట్లాడుతూ తనకు ఉన్న అనుభవం పరిచయాలతో మాజీ ఎంపీ కోరిన న్యాయమైన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాష్‌నాయుడు, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, గాడి తిలక్, చక్రపాణి, ముత్యాలయ్య, ఖలీల్, తదితరులు ఉన్నారు.

నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం

గూడూరు అర్బన్, జూన్ 29: స్థానిక గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో శనివారం నరసయ్య దాతృత్వంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, సునీల్‌కుమార్, రాహుల్, కలీమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రేషన్ సరుకుల పంపిణీ

నాయుడుపేట టౌన్, జూన్ 29 : జూలై 1వ తేదీ నుంచి వేగవంతగా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దారు కళ్యాణి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో శనివారం రేషన్ దుకాణందారులు, ఎండీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీలు రాజేంద్ర, ఓబయ్య, రేషన్ దుకాణందారులు, ఎండీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూన్ 29: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిపారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపి ఆలయం ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

చిల్లకూరు, జూన్ 29: పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ శ్రీనివాసులునాయుడు విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు, ఎంఈవోలు సనత్‌కుమార్, రఫూఫ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్ర, ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, వీవీ కుమార్, సరేంద్ర, చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు, జూన్ 29: డయేరియా బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుమ అన్నారు. శనివారం స్థానిక దళితవాడలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో మునిలక్ష్మి, రవికుమార్, లక్ష్మి, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి,జూన్29: వెంకటగిరి ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన బాలబాలికలు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేయించుకున్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నెంబరుతోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి స్థానిక ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9866420415, 9441850595 నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వెంకటగిరిటౌన్, జూన్ 29: స్థానిక బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాల వద్ద శ్రీనివాస సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి వారు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జి జయసింగ్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 286 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి 60 మందికి శస్త్ర చికిత్సలు చేయించాలని డాక్టర్లు నిర్ధారించారు. కార్యక్రమంలో తిరుపతి అరవింద కంటి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ట్రస్టు నిర్వాహకులు వీడీవో కేశవులు, సతీష్, అలెక్య, పార్థ, సాయి, శివ పాల్గొన్నారు.

చేపల వేలం పాట

బాలాయపల్లి, జూన్29: మండలంలోని ఊట్లపల్లి పంచాయతీ పరిధి పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓటు చెరువులోని చేపలు పట్టుకునేందుకు శనివారం పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో దుర్గాటి పవన్‌కళ్యాణ్ అనే వ్యక్తి రూ.17 వేలకు పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోళ్ల సుధాకర్ బాబు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ కిలివేటికి సత్కారం



పెళ్లకూరు, జూన్ 29 : పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కిలివేటి సుబ్రహ్మణ్యంను శనివారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సూళ్లూరుపేట సమీపంలోని కోటపోలూరుకు చెందిన కిలివేటి సుబ్రహ్మణ్యం 1989లో కానిస్టేబుల్‌గా ఎంపికై 2012లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 2018లో ఏఎస్ఐగా పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు చేపట్టి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన సుబ్రహ్మణ్యం శనివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారి చేతులమీదుగా సత్కారం అందుకున్నారు.

ఆల్ ది బెస్ట్ ఆకృతిలో మానవహారం



గూడూరు అర్బన్, జూన్ 29: టీ-20 ప్రపంచ కప్‌లో భారత్ క్రికెట్ టీం విజేతగా నిలవాలని ఆదిశంకర పాఠశాల విద్యార్థులు ఆల్ ది బెస్ట్ ఆకృతిలో మానవహారం ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం స్థానిక గోగినేనిపురంలోని ఆదిశంకర పాఠశాలలో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి భారత్ టీంకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ శనివారం జరిగే టీ-20 ప్రపంచ కప్‌లో సౌత్ ఆఫ్రికాపై భారత్ టీం గెలిచి దేశప్రతిష్ఠను నిలపాలని ఆకాంక్షిస్తూ భారతీయుల కలలను నేరవేర్చాలని కోరుకుంటూ తమ పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, ప్రశాంత్, మనోహర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం



సాత్విక, మహిత, యుగంధర్, యశ్వంత్, లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

జనసేన కార్యాలయంలో నటుడు ప్రభాకర్



వెంకటగిరిటౌన్, జూన్ 29: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం బాహుబలి సినిమాలో కాలకేయగా నటించిన ప్రభాకర్ సందడి చేశారు. ప్రభాకర్‌ను చూసేందుకు జనసేన నాయకులు, అభిమానులు వచ్చి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటగిరిలో జరుగుతున్న సలాం సైనిక షూటింగ్‌కు వచ్చామన్నారు. అనంతరం జనసేన ఉమ్మడి నెల్లూరుజిల్లా ప్రధానకార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లుతో జనసేన కార్యకలాపాలు అడిగి తెలుసుకున్నారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే పాశం



టీ తాగుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

కోట,జూన్29: గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తానిచ్చిన మాటను శనివారం రాత్రి నెరవేర్చారు. గతేడాది కోటలో యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్, అప్పటి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌లకు కోట బజారు సెంటర్‌లో ఉన్న ఓ టీ కొట్టు యజమాని పరుగుపరుగున వచ్చి నీళ్లు ఇచ్చి తాగమని చెప్పారు. తన కొట్టులో టీ తెచ్చి ఇచ్చి సేదతీరి పాదయాత్ర వేగం పెంచాలని పాశం సునీల్‌కుమార్ భుజం తట్టారు. ఎమ్మెల్యే అయిన తర్వాత ఇక్కడకే వచ్చి నీ దగ్గర టీ తాగుతానని మాటిచ్చారు. ఎట్టకేలకు ఎన్నికల్లో పాశం సునీల్‌కుమార్ గెలిచి తొలిసారిగా కోటకు వచ్చి అదే కొట్టులో టీ తాగి మాట నిలబెట్టుకున్నారు.

అల్ట్రా స్కానింగ్ సెంటర్ల మంజూరు

కోట, జూన్ 29 : బాలయపల్లి, డీవీ సత్రం, పెళ్లకూరు ప్రభుత్వ ఆస్పత్రులకు అల్ట్రా స్కానింగ్ సెంటర్లు మంజూరు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి బాబునెహ్రూరారెడ్డి తెలిపారు. కోట ఆసుపత్రి, చిట్టేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. వైద్యసేవలు, డాక్టర్ల పనితీరు, పనివేళలపై ఆరాతీశారు. వార్డులను, మందులను తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ రూప, డాక్టర్ జోమ్‌ప్రియరావు ఉన్నారు.